క్లుప్తంగా

అయ్యప్ప భక్తులకు అన్నదానం



పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

షాద్‌నగర్: పట్టణంలోని లక్ష్మీనర్సింహ్మ కాలనీలోని శివమారుతీ గీతా అయ్యప్ప మందిరంలో మంగళవారం పట్టణానికి చెందిన అందె రాజేశ్వర్ కుటుంబ సభ్యులు భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా దేవాలయంలో అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు చంద్రశేఖర్, బసప్ప, మాజీ మున్సిపల్ చైర్మన్ విశ్వం, మంజుశ్రీ రాఘవేందర్, నందీశ్వర్, జైహింద్‌రెడ్డి, ఆర్ఎస్ రాజు, వెంకటేష్‌గౌడ్, కోటి లింగంగౌడ్ పాల్గొన్నారు.

విజ్ఞానశాస్త్రంపై అవగాహన అవసరం

ఎంఈఓ శంకర్‌రాథోడ్



కిట్లను పంపిణీ చేస్తున్న ఎంఈఓ

షాద్‌నగర్: విద్యార్థులు విజ్ఞాన శాస్త్రంపై అవగాహన పెంపొందించుకోవాలని ఎంఈఓ శంకర్ రాథోడ్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాలలో నాసా పోటీలకు ఎంపికైన విద్యార్థులకు కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శంకర్ రాథోడ్ మాట్లాడుతూ.. విద్యార్థులు చిన్న నాటి నుంచి క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసిస్తే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని అన్నారు. ప్రతి విద్యార్థి లక్ష్య సాధన కోసం శ్రమించాలని తెలిపారు. ప్రతి విద్యార్థి చదువుల్లో రాణించి పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని సూచించారు. నాసాలో ప్రయోగాలు చేసే అవకాశం విద్యార్థులకు రావడం ఎంతో హర్షనీయమన్నారు. విద్యార్థులు విజ్ఞాన శాస్త్రంపై పట్టు సాధిస్తే భవిష్యత్తులో మంచి స్థాయికి ఎదుగుతారని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ శ్రీధర్, చైర్మన్ శ్రీవిద్య, ప్రిన్సిపాల్ ఆనంద్, ఏజీఎం భాస్కర్‌రెడ్డి, తిరుమల్‌రెడ్డి, వీరేందర్, సాయికుమార్ పాల్గొన్నారు.

హామీలను నమ్మి మోసపోవద్దు

పాలమూరు ట్రస్టు చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి



ర్యాలీలో మాట్లాడుతున్న విష్ణువర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్: ఎన్నికల నేపథ్యంలో నేతలు ఇచ్చిన హామీలను చూసి మోసపోవద్దని, సేవకుడికి ఓటు వేసి గెలిపించాలని పాలమూరు ట్రస్టు చైర్మన్, ఆల్ ఇండియా ఫార్వర్డు బ్లాక్ అభ్యర్థి విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలో భారీ బైక్ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు అనేది వజ్రాయుధం లాంటిందని అన్నారు. ఓటు వేసే ముందుకు ప్రతి ఒక్కరు మనస్సుతో ఆలోచించి ఓటు వేయాలని కోరారు. ప్రజలకు సేవ చేసేందుకు తాను ముందుకు వచ్చానని ట్రస్టు ఆధ్వర్యంలో ఇప్పటికే ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టానని అన్నారు. ఉచిత హామీలు ఇచ్చి మోసం చేసే వారిని నమ్మొద్దని సూచించారు.

మోకిల పంచాయతీ కార్యదర్శిపై విచారణ



గ్రామస్తులతో మాట్లాడుతున్న అమృత

శంకర్‌పల్లి: మండలంలోని మోకిల గ్రామ పంచాయతీలో జరిగిన అవకతవకలపై డీఎల్‌పీఓ అమృత మంగళవారం పంచాయతీ కార్యాలయంలో పాలకవర్గం సమక్షంలో విచారణ చేపట్టారు. మోకిల సర్పంచ్ పి.సుమిత్రామోహన్ రెడ్డి ఫిర్యాదు మేరకు మండల పంచాయతీ అధికారి గీతతో కలిసి రికార్డులను పరిశీలించారు. అనంతరం పంచాయతీ పాలకవర్గం సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గ్రామంలోని 270 ఇళ్లకు గ్రామ పంచాయతీ కార్యదర్శి లక్ష్మీతులసి జీరో ట్యాక్స్ ఏ విధంగా చేస్తారని ప్రశ్నించారు. దీంతో ప్రతీ సంవత్సరం గ్రామ పంచాయతీ ఆదాయానికి రూ. 20లక్షలకు పైగా గండి పడుతుందని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మోకిల గ్రామంలో కొత్తగా నిర్మించిన ఇళ్లకు అసైన్‌మెంట్ చేయకుండానే డబ్బులు వసూలు చేయడం జరిగిందని ఆరోపించారు. ఈ సందర్భంగా డీఎల్‌పీఓ అమృత మాట్లాడుతూ.. సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కాగా, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మోకిల పంచాయతీలో రికార్డులను పరిశీలించడం జరిగిందన్నారు. నివేదికను తయారు చేసి కలెక్టర్‌కు అందజేస్తామని తెలిపారు.

కాంగ్రెస్, బీజేపీలను నమ్మరు

- బీఆర్ఎస్ చేవెళ్ల ఎమ్మెల్యే అభ్యర్థి కాలె యాదయ్య
- చివరి రోజు ర్యాలీలు, ఇంటింటి ప్రచారంతో బిజీబిజీ



చేవెళ్ల : రోడ్‌షో ఎమ్మెల్యే అభ్యర్థి కాలె యాదయ్య, కార్యకర్తలు

చేవెళ్ల: దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి ఏళ్ల తరబడి అధికారంలో ఉన్న పార్టీలు అప్పుడు చేయలేని అభివృద్ధి ఇప్పుడు చేస్తామనడం విడ్డూరంగా ఉందని బీఆర్ఎస్ పార్టీ చేవెళ్ల ఎమ్మెల్యే అభ్యర్థి కాలె యాదయ్య ఎద్దేవా చేశారు. మండలంలోని పామెన, అల్లవాడ, జాలగూడ గ్రామాల్లో మంగళవారం ఎన్నికల ప్రచారంలో చివరి రోజున రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మరోసారి కారు గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా గెలిపించి మీకు సేవ చేసే అవకాశం కల్పించాలని కోరారు. రాష్ట్రం వచ్చిన తరువాత కేసీఆర్ నాయకత్వంలో గ్రామాలు, రాష్ట్రం అభివృద్ధి చెందిందని మరోసారి అవకాశం కల్పిస్తే మరింత అభివృద్ధి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మల్లారెడ్డి, యాదయ్య, విజయ్, వెంకటేశ్, నరేందర్, భీమ్‌రెడ్డి, ప్రభాకర్, ఎంపీపీ విజయలక్ష్మి, మాజీ ఎంపీపీ ఎం.బాల్‌రాజ్, కృష్ణారెడ్డి, చింటూ, వెంకట్‌రెడ్డి, ఎం.యాదగిరి, నరేందర్, దయాకర్, మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, మండల పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి

షాబాద్: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే బీఆర్ఎస్ అభ్యర్థి కాలె యాదయ్యను గెలిపిస్తాయని ఆ పార్టీ రాష్ట్ర నాయకులు జడల రాజేందర్‌గౌడ్, షాబాద్ మాజీ సర్పంచ్ వెంకట్‌యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం షాబాద్ గ్రామంలో గడపగడపకూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీజేపీలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని విమర్శించారు. రైతుల కష్టాలు తెలిసిన సీఎం కేసీఆర్ రైతుబంధు, రుణమాఫీ వంటి పథకాలతో మేలు చేస్తున్నాడని తెలిపారు. అన్నదాతల సంక్షేమానికి పెద్దపీట, బడుగు, బలహీన, నిరుపేద వర్గాలకు అన్ని విధాలా అండగా నిలుస్తున్నామని స్పష్టం చేశారు. ఇంటింటికి సంక్షేమ పథకాలను అందిస్తున్న ప్రభుత్వాన్ని ఆదరించాలని పిలుపునిచ్చారు. మూడోసారి బీఆర్ఎస్‌ను అత్యధిక మెజారీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వెంకటయ్య, రాంచందర్, సత్యం, తదితరులున్నారు.

రాష్ట్రం రూపు రేఖలు మారాయి



ర్యాలీ నిర్వహిస్తున్న అవినాశ్‌రెడ్డి తదితరులు

షాబాద్: ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు అనంతరం తెలంగాణ రూపురేఖలు మారాయని షాబాద్ జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి వ్యాఖ్యనించారు. మంగళవారం మండలంలోని సంకెపల్లిగూడ, సీతారాంపూర్, చందనవెల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఏ రాష్ట్రంలో అమలు చేయని పథకాలను తెలంగాణలో సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టాడని అన్నారు. బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని చెప్పారు. రైతుబంధు, రుణమాఫీ వంటి పథకాలు తీసుకువచ్చి రైతుల కష్టాలు తొలగించారని వివరించారు. కాంగ్రెస్ హయంలో తాగు నీటికి అనేక ఇబ్బందులు పడిన రోజులను ప్రజలు గుర్తుకు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్దార్ నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింగ్‌రావు, సహకార సంఘం చైర్మన్ శేఖర్‌రెడ్డి, వైస్ చైర్మన్ మల్లేశ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు నక్క శ్రీనివాస్‌గౌడ్, నర్సింహారెడ్డి, వెంకటయ్య, మండల రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షులు మధుసూదన్‌రెడ్డి, సర్పంచ్‌లు దర్శన్, పాండురంగారెడ్డి, గ్రామస్తులు తదితరులున్నారు.

కుటుంబపాలనకు కాలం చెల్లింది

- పామెన భీంభరత్



చేవెళ్లలో నిర్వహించిన భారీ ర్యాలీలో నాయకులు

చేవెళ్ల: రాష్ట్రంలో కేసీఆర్, చేవెళ్లలో ఎమ్మెల్యే కాలె యాదయ్య కుటుంబపాలనకు ప్రజలు చరమగీతం పాడనున్నారని చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పామెన భీంభరత్ అన్నారు. మండలకేంద్రంలో మంగళవారం భారీ ర్యాలీ నిర్వహించారు. శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేసిన అనంతరం అక్కడి నుంచి చేవెళ్ల ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహించి చేవెళ్లలోని రచ్చబండ వద్ద సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం వస్తే ఉద్యోగాలు వస్తాయని భావిస్తే వారి కుటుంబాలకు ఉద్యోగాలు ఇచ్చుకున్నారని మండిపడ్డారు. ఓటమి భయంతోనే తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. కరెంటు ఇవ్వరు, పింఛన్‌లు ఇవ్వరు, రైతుబంధు ఇవ్వరు అని ప్రచారం చేసి ఓట్లు వేయించుకోవాలనే ప్రయత్నం చేస్తున్నారన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గం సమన్వ య కమిటీ అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, ప్ర చార కమిటీ సభ్యుడు వసంతం, చేవెళ్ల సర్పంచ్ శైలజ, పీఏసీఎస్ చైర్మన్‌లు డి. వెంకట్‌రెడ్డి, ఉప సర్పంచ్ గంగి యాదయ్య, మాజీ ఉప సర్పంచ్ టేకుపల్లి శ్రీనివాస్, మండలపార్టీ అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మాట తప్పని పార్టీ కాంగ్రెస్

షాబాద్: కాంగ్రెస్ పార్టీ మాట ఇచ్చిందంటే కచ్చితంగా నెరవేస్తుందని పీసీసీ ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, పీసీసీ కార్యదర్శులు పీసరి సురేందర్ రెడ్డి, ఎన్.రాంరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కుర్వగూడ, సర్దార్‌నగర్ గ్రామాల్లో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్‌తో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను కచ్చితంగా అమలు చేస్తామని భరోసా కల్పించారు. రైతులకు ఒకే విడతలో రూ. 2లక్షల రుణమాఫీ చేస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల మహిళ అధ్యక్షుడు అశ్వని, కేసారం మాజీ సర్పంచ్ చెన్నయ్య, భీమయ్య, జంగయ్య,వేణు ఉన్నారు.

చేవెళ్లలో కాంగ్రెస్ గెలుపు ఖాయం

మొయినాబాద్‌రూరల్: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా చేవెళ్ల గడ్డపై ఎగురవేయడం ఖాయమని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, రాష్ట్ర వార్డు సభ్యుల వ్యవస్థాపక అధ్యక్షుడు అల్లం శ్రీనివాస్‌రెడ్డిలు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని అజీజ్‌నగర్, బంగాలిగూడ ఆయా గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. గడపగడపకూ తిరుగుతూ, ర్యాలీ నిర్వహించి ప్రజలను ఓటు అభ్యర్థించారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు మైపాల్ రెడ్డి, నర్సింగ్, వెంకట్‌రెడ్డి, వెంకటేశ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకుడు

మొయినాబాద్: సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, మండల బీఆర్ఎస్ నాయకుడు దారెడ్డి కృష్ణారెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారు. మంగళవారం మండల కేంద్రంలో చేవెళ్ల అభ్యర్థి పామెన భీంభరత్ సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా భీంభరత్ మాట్లాడుతూ.. చేవెళ్ల నియోజకవర్గంలో కాంగ్రెస్ గెలుస్తుందన్నారు. ప్రజలంతా కాంగ్రెస్ వైపే చూస్తున్నారని.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాబోతుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు షాబాద్ దర్శన్, మండల పార్టీ అధ్యక్షుడు మాణయ్య, మాజీ ఎంపీటీసీ మాధవరెడ్డి, మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి, నాయకులు అశోక్‌రెడ్డి, భిక్షపతి ముదిరాజ్, అంజనేయులు, సురేష్ ఉన్నారు.

డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే అభివృద్ధి

- చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



శంకర్‌పల్లి: మాట్లాడుతున్న ఎన్నికల ఇన్‌చార్జి చంద్రప్ప, కే.ఎస్ రత్నం

చేవెళ్ల: కేంద్రం, రాష్ట్రంలో ఒకే ప్రభుత్వం డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే అభివృద్ధి సాధ్యమవుతుందని బీజేపీ చేవెళ్ల ఎమ్మెల్యే అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే కెఎస్.రత్నం అన్నారు. మండలంలోని రామన్నగూడ, న్యాలట, కేసారం, సింగప్పగూడ గ్రామాల్లో మంగళవారం కెఎస్.రత్నం, ఆయన సతిమణి ప్రమీల, కూతురు ప్రణీతలు వేర్వేరుగా ఆయా గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీజేపీతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులన్నింటికీ కేంద్రం నుంచి నిధులు వస్తున్నాయని చెప్పారు. ఎమ్మెల్యేగా తనకు అవకాశం కల్పిస్తే నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని చెప్పారు. నియోజకవర్గంలోని యువత, ప్రజలకు మెరుగైన వైద్యం, విద్య సౌకర్యాలను కల్పిస్తానని చెప్పారు. రైతులకు పొలాలకు వెళ్లే లింక్ రోడ్లను అభివృద్ధి చేస్తానని భరోసా కల్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాండురంగారెడ్డి, అనంత్‌రెడ్డి, శర్వలింగం, ప్రభాకర్‌రెడ్డి, రాంరెడ్డి, సుధాకర్‌రెడ్డి, శ్రీశైలం, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, అంజనేయులు, సత్యనారాయణ, కృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

కేసీఆర్, కేటీఆర్‌లను బొందపెట్టాలి

చేవెళ్ల: సీఎం కేసీఆర్, కేటీఆర్ ప్రజలకు ఏం చేశారని ఓట్లు అడుగుతున్నారని ఈ ఎన్నికల్లో వారిని బొంద పెట్టాలని చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. చేవెళ్లలో బహిరంగ సభ నిర్వహించిన కేసీఆర్ చేవెళ్లకు ఏం చేశాడని నిలదీశాడు. జీఓ 111ను ఎత్తేస్తామని 10ఏళ్లుగా చెబుతునే ఉన్నాడని, మళ్లీ ఇప్పుడు కూడా అదే పాటపాడుతున్నాడని విమర్శించారు. ఎన్నికలప్పుడు వచ్చేసార్ మళ్లీ ఎన్నికలకే వస్తాడు. అప్పటి వరకు ప్రజలు గుర్తుకు రారని ఎద్దేవా చేశారు. ప్రజలు బీఆర్ఎస్‌ను నమ్మే పరిస్థితి లేదని రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీల మధ్యనే పోటీ ఉందని చెప్పారు. ఓటమి భయం బీఆర్ఎస్‌కు పట్టుకుందన్నారు. కేంద్రంలో మోదీ వల్లే రాష్ట్రానికి కరెంట్ వస్తుందని ఈ ప్రభుత్వం లక్షలకోట్ల అప్పులు చేసి విద్యుత్ సంస్థ ఆస్తులను తాకట్టు పెట్టిందన్నారు. ఐటీ శాఖ మంత్రి హైదరాబాద్‌ను అభివృద్ధి చేశామని చెబుతున్నాడు అది ప్రైవేటు అభివృద్ధి అని అది చూసి ఐటీ ఉద్యోగులు అంతా ఓట్లు వేస్తారని అనుకోవడం అవివేకమన్నారు. చదువుకున్న వారు ఎవరు బీఆర్ఎస్‌కు ఓటు వేసే పరిస్థితి లేదని చెప్పారు. చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో బీజేపీ నాలుగు అసెంబ్లీ స్థానాలను గెలుస్తుందన్నారు. చేవెళ్ల బీజేపీ అభ్యర్థి కేఎస్. రత్నం గెలువడం ఖాయమన్నారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు పాండురంగారెడ్డి, అనంత్‌రెడ్డి, శర్వలింగం, వెంకట్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, అశోక్, ప్రవీణ్, మధుసూదన్‌రెడ్డి, ప్రశాంత్, శ్రీపాల్‌రెడ్డి, సీహెచ్ శ్రీనివాస్, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం

శంకర్‌పల్లి: రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని కర్నాటక ఎమ్మెల్యే, చేవెళ్ల నియోజకవర్గం ఎన్నికల ఇన్‌చార్జి చంద్రప్ప పేర్కొన్నారు. మంగళవారం మున్సిపల్ పరిధిలో సింగాపురం, శంకర్‌పల్లి వార్డుల్లో ఎమ్మెల్యే అభ్యర్థి కే.ఎస్ రత్నంతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ ప్రజా సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. అభ్యర్థి కే.ఎస్ రత్నం మాట్లాడుతూ.. చేవెళ్ల నియోజకవర్గం అభివృద్ధి కోసం బీజేపీకి ఓటు వేయాలని కోరారు. కాగా శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలో డబుల్‌బెడ్ రూం ఇళ్లను నిర్మించి స్థానికులకు ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే డబుల్‌బెడ్‌రూం ఇళ్లను స్థానికులకు అందించేలా చర్యలే తీసుకోవడం జరుగుతుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు ప్రభాకర్‌రెడ్డి, చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు రాములుగౌడ్, మున్సిపల్ అధ్యక్షుడు బీర్ల సురేష్, నాయకులు పాల్గొన్నారు.

నా భర్తను గెలిపించండి

వీర్లపల్లి శంకర్ సతీమణి అనురాధ



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న అనురాధ

కేశంపేట: షాద్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి వీర్లపల్లి శంకర్‌ను గెలిపించాలని ఆయన సతీమణి ప్రజలను కోరారు. మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ గ్రామంలో మంగళవారం వీర్లపల్లి శంకర్ భార్య అనురాధ కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. తన భర్త గెలుపు కోసం హస్తం గుర్తుకు ఓటు వేయాలని గ్రామస్తులను అభ్యర్థించారు. అనురాధ తల్లిదండ్రులది పాపిరెడ్డి గూడ గ్రామం కావడంతో గ్రామస్తులు ఆమెకు బ్రహ్మరథం పట్టారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సుందరయ్య, కృష్ణారెడ్డి, భిక్షపతి, టైలర్ యాదయ్య, రవీందర్, రాఘవేందర్, నర్సింలు, రాణి పాల్గొన్నారు.

'దళితబంధు'వుల జీవితాల్లో వెలుగు

నవాబుపేట: చేవెళ్ల ప్రజా ఆశీర్వాద సభలో నియోజకవర్గ దళితులందరికీ ఒకేసారి దళిత బంధు ఇస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించడంతో.. ఆ సామాజిక వర్గం హర్షం వ్యక్తం చేస్తోందని దళిత రత్న అవార్డు గ్రహీత శివరాజ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే కాలె యాదయ్య విన్నపం మేరకు సోమవారం జరిగిన సభలో కేసీఆర్ మాట్లాడుతూ.. మరోసారి అధికారంలోకి రాగానే దళితబంధు ఇస్తామని చెప్పారని పేర్కొన్నారు. అందుకోసం దళితులు బీఆర్ఎస్‌కు ఓటువేసి.. మరోసారి కేసీఆర్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోవాల్సి ఉందని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ రత్నం, దళిత నాయకులు ఏసుదాస్, అంజయ్య, జాన్, భాస్కర్, నర్సింహులు, కుమార్, ప్రభాకర్, అశోక్ ఉన్నారు.

ప్రగతి పథంలో నడిపించా

- బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కాలె యాదయ్య ఇంటర్వ్యూ



చేవెళ్ల: నియోజకవర్గంలో ప్రధాన పార్టీలైన బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు పోటీలో ఉన్నారు. దీంతో ఇక్కడ త్రిముఖ పోటీ నెలకొంది. చేవెళ్ల గడ్డపై ఎవరి జెండా ఎదురుతుందోననే ఉత్కంఠ నెలకొంది. ఈ నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్యతో 'సాక్షి' ఇంటర్వ్యూ.. ఆయన మాటల్లోనే..

మా కుటుంబానికి నాకన్నా ముందు రాజకీయ నేపథ్యం లేదు. పీఏసీఎస్ డైరెక్టర్, చైర్మన్, ఎంపీపీ, జెడ్పీటీసీ, టీటీడీ బోర్డు సభ్యుడిగా సేవలందించా. ఆ తర్వాత ఎమ్మెల్యేగా పనిచేస్తున్నా. ఇప్పుడు నాలుగోసారి బరిలో ఉన్నా. అందరిలో ఒక్కడిగా కలిసిపోయి పనిచేస్తున్నా. అందుకే నాకు అందరి వాడనే పేరుంది.

నేను ఎమ్మెల్యేగా తొమ్మిదిన్నరేళ్లుగా ఉన్నా.. నియోజకవర్గంలో రోడ్లు, బ్రిడ్జిలు, ప్రతీ మండలానికి గురుకుల పాఠశాల, ఐదు మండలాల్లో 5వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం ఉన్న గోదాంలకు ఒక్కటి రూ. 3కోట్లు చొప్పున మంజూరు చేయించా. చేవెళ్ల ఏసీపీ కార్యాలయం నిర్మాణం, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు, 4 సీఐ హెడ్‌క్వార్టర్స్ మంజూరు, చేవెళ్లలో 100 పడకల ఆస్పత్రికి రూ.18 కోట్లు మంజూరు చేయించి నియోజకవర్గాన్ని ప్రగతి పథంలో నడిపించాను.

గత వాగ్దానాలను దాదాపుగా పూర్తి చేశాను. ఇవ్వని హామీలు సైతం ఎన్నో నెరవేర్చా.. ప్రధానంగా జీఓ 111ను తొలగిస్తానని ఇచ్చిన హామీని కేసీఆర్ చేత నెరవేర్చాను. చేవెళ్ల డిగ్రీ కళాశాల భవనం పూర్తి అయింది.. త్వరలో ప్రారంభానికి సిద్ధంగా ఉంది.

ప్రతిపక్షపార్టీలు గెలుపు కోసం అనేక ఆరోపణలు చేస్తారు. వాటిలో వాస్తవాలు ఉండాలి కాదా. నేను భూకబ్జాలు చేసినట్లు నిరూపించాలి అప్పుడే అవి నిజమని ప్రజలు నమ్ముతారు. ఏ వ్యక్తిని బెదిరించిన దఖాలాలు లేవు. నేరాలు, రౌడీయిజం, దోపిడీలు చేసినట్లు నిరూపిస్తే నేనే రాజకీయాల నుంచి తప్పుకుంటా.

ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు, కేసీఆర్ పాలనను చూసి బీఆర్ఎస్‌కు ఓటు వేయాలి. ఎమ్మెల్యేగా తన సేవలు. నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులు, పరిశ్రమలు తీసుకువచ్చిన వ్యక్తిగా, అందుబాటులో ఉండే నాయకుడిగా గుర్తించి తనకు ఓటు వేయాలని, వేస్తారని నమ్ముతున్నాను. నియోజకవర్గంలో రైతుబంధు, రైతు బీమా, రుణమాఫీ, కళ్యాణలక్ష్మి, షాదీముబారక్, గృహలక్ష్మి, గొర్రెల పంపిణీ, కేసీఆర్ కిట్స్ తదితర పథకాలతో కోట్ల రూపాయలు వచ్చాయి. గతంలో ఉన్న అభివృద్ధి ఇప్పుడు జరుగుతున్న అభివృద్ధి చూస్తేనే ప్రజలకు ఎవరికి ఓటు వేయాలో తెలిసిపోతుంది. మరోసారి అవకాశం కల్పిస్తే మరింత అభివృద్ధి చేస్తా. ప్రభుత్వం అందించే అన్ని పథకాలను ప్రతి గడపకు అందేలా చేస్తూ ,అందుబాటులో ఉంటు మీలో ఒక్కడిగా ఉంటాను.

పోలింగ్ సామగ్రి పంపిణీకి సర్వం సిద్ధం



చేవెళ్లలోని ఫరా ఇంజనీరింగ్ కళాశాల వద్ద ఎన్నికల సామగ్రి పంపిణీకి సిద్ధం చేసిన అధికారులు



షాద్‌నగర్: టేబుళ్లను పరిశీలిస్తున్న రిటర్నింగ్ అధికారి వెంకట మాధవరావు

షాద్‌నగర్: అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా పోలింగ్ సామగ్రిని పంపిణీ చేసేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పట్టణంలోని మినీ స్టేడియంలో బుధవారం ఉదయం నుంచి సిబ్బందికి సామగ్రి పంపిణీ చేయనున్నారు. ఇందుకు ప్రత్యేకంగా టెంట్లు వేసి, టేబుళ్లను ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలో మొత్తం 255 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. మొత్తం 1100 మంది పోలింగ్ సిబ్బంది విధులు నిర్వహించనున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకట మాధవరావు తెలిపారు. ఈవీఎం యంత్రాలకు సంబంధించిన స్ట్రాంగ్ రూంను బుధవారం ఉదయం 7 గంటలకు ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థుల ఎదుట తెరవనున్నారు. అనంతరం ఈవీఎంలను పోలింగ్ సిబ్బందికి అప్పగించనున్నారు. పోలింగ్ సిబ్బంది గ్రామాలకు వెళ్లేందుకు గాను ఎన్నికల సంఘం వారు ప్రత్యేకంగా బస్ సౌకర్యం ఏర్పాటు చేశారు. ఎన్నికల్లో మొత్తం 500 మంది పోలింగ్ సిబ్బందితో పాటుగా, స్పెషల్ ఫోర్స్ 76 మంది పోలీసులు విధులు నిర్వహించనున్నారు. 26 గ్రామాల పరిధిలోని 51 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా గుర్తించినట్లు ఏసీపీ రంగస్వామి తెలిపారు.

అభివృద్ధి చేశా ఆశీర్వదించండి



కేశంపేట: ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

- ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

కేశంపేట: గత పదేళ్లుగా నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని, మళ్లీ అవకాశం ఇవ్వాలని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ కోరారు. మండలంలోని అల్వాల, కేశంపేట, పాటిగడ్డ, మంగళిగూడ గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు అధిక నిధులను తీసుకువచ్చి అభివృద్ధి చేశానని చెప్పారు. తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చి గిరిజనుల చిరకాల కోరికను బీఆర్ఎస్ ప్రభుత్వం నెరవేర్చిందన్నారు. పార్టీలకు సంబంధం లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అందజేశామని తెలిపారు. గ్రామాల్లో ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని వెల్లడించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని తెలిపారు. కార్యక్రమాల్లో కేశంపేట సర్పంచ్ తలసాని వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీపీ విశ్వనాథం, మాజీ జెడ్పీటీసీ పల్లె నర్సింగ్‌రావు, దశరథ్, అంజిరెడ్డి, లక్ష్మీనారాయణ, నర్సింలు, జయరామ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం



ఎంపీపీ సమక్షంలో బీఆర్ఎస్ చేరిన నేతలు

షాద్‌నగర్: రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలంటే బీఆర్ఎస్‌తోనే సాధ్యమని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం ఎమ్మెల్యే పట్టణంలోని వివిధ వార్డులో ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొట్లాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలంటే కేసీఆర్‌ను మరోసారి సీఎంను చేయాలని కోరారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని కులవృత్తులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం సబ్సిడీ రుణాలను అందజేసిందని తెలిపారు.

బీఆర్ఎస్‌లో చేరిక

మండలంలోని కొండన్నగూడ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ విజయలక్ష్మి, వెంకట్‌రెడ్డి దంపతులు 50 మంది అనుచరులు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి ఎంపీపీ రవీందర్ యాదవ్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు.

అణగారిన వర్గాల ఆశాజ్యోతి పూలే

- తెలంగాణ చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహులు



పూలే విగ్రహానికి నివాళి అర్పిస్తున్న రాపోల్

షాబాద్: మూఢవిశ్వాసాలకు వ్యతిరేకంగా పోరాడిన సామాజిక విప్లవ కారుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని తెలంగాణ చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాపోల్ నర్సింహులు అన్నారు. మంగళవారం షాబాద్‌లో జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జ్యోతిరావు పూలే గొప్ప సామాజిక విప్లవకారుడని, మనువాదాన్ని ఎదిరించి సమాజంలో నిస్సహాయులుగా మిగిలిన వారి కోసం తాను జీవితాంతం పాటుపడిన త్యాగశీలి అని కొనియాడారు. పూలే ఆశయాల సాధనకు యువత కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కుల సంఘాల నాయకులు విశ్వంమాదిగ, జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, అంబేడ్కర్ సంఘం మాజీ అధ్యక్షుడు వెంకటేశ్, తెలంగాణ చైతన్య సమితి మండల కార్యదర్శి విఠలయ్య, తదితరులున్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.